# శ్రీ సన్నిధానం

సంపుటి 1 సంచిక 11 అక్టోబర్ 2022



## ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. విజయసూచిక ఆశ్వయుజం
5. మన దేవాలయాలు
   సుప్రసిద్ధ వరాల వరాహ క్షేత్రం
6. రామానుజ సుధామాధురి
   సంబంధం - బంధమోచనం
8. మనసులోని మాట
9. ఆధ్యాత్మిక వార్తలు
10. ఆదిశంకర జన్మభూమిలో మోదీ
11. బాలవిజ్ఞానం
   చండీ ఉద్దాలకుల కథ



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్
డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

భారత దేశానికి ప్రపంచ పటంలో హిందూదేశంగా గుర్తింపు తీసుకు రావడంలో ప్రధాని మోదీ చేస్తున్న కృషి ఇదీ అని చెప్పలేం కానీ ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరియడానికి వారు ఆచరిస్తున్న విధానం శ్లాఘనీయం. దేశంలోఎక్కడ ఆధ్యాత్మిక వికాసం జరుగుతున్నా అక్కడ మోదీ కనిపిస్తాడన్నది వాస్తవం. ఆసేతు హిమాచల పర్యంతం ప్రతి కార్యక్రమంలో వారు కనిపిస్తున్నారు. ఈ సంవత్సరం రామానుజ సహస్రాబ్ది సందర్భంగా హైదరాబాద్ ముచ్చింతలలో సమతామూర్తి ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదే విధంగా కేరళలో నరేంద్ర మోదీ అధికార పర్యటనకు విచ్చేసిన సందర్భంలో 'ఆది శంకర జన్మభూమి క్షేత్రం' సందర్శించి హిందూ సమాజంలో స్ఫూర్తిని కలిగించారు. హిందువులంతా సమైక్యంగా ఉండాల్సిన సమయం ఇదే అంటూ పరోక్షంగా ఆచరణలో చూపారు. ఆధ్యాత్మిక గురువులు, వారి విధానాల పట్ల సమాజంలో విశ్వాసం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. యోగా విశిష్టతను విదేశాలలో గొంతెత్తి గతంలో చాటారు. సంస్కరణలు అన్నీ ఒకే మారు జరగవు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చాపకింద నీరులా వ్యాపించిన వాసనలను పసిగట్టి వాటిని సంస్కరించే ప్రయత్నం చేస్తున్నారు. వారి యత్నానికి ఆధ్యాత్మిక వేత్తలు, ఆధ్యాత్మిక గురువులు అంతా కాస్త చేయూతనిస్తే హిందూదేశ వైభవం పరిఢవిల్లుతుందనడంలో అతిశయోక్తిలేదు.


PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణకు నడుం బిగించండి!!

భగవద్గీతలో అన్ని విషయాలు, ధర్మసూక్ష్మాలు ఉన్నాయంటూ ఆధ్యాత్మిక గురువులు, ఆచార్యులు అడుగడుగునా బోధిస్తున్నారు. అయినా మన చెవికి ఒక పట్టాన ఎక్కడంలేదు. ఎందుకంటే మనకు విద్యాబుద్ధులు చెపుతున్న సమయంలో పాఠశాల విద్యలో బోధించిన దాఖలాలు లేవు. మన సంస్కృతీ సంప్రదాయాలకు విలువనిచ్చే ఈ అంశం పాఠశాల విద్యలో కనిపించదు. అలాంటి ప్రస్తావన ఎక్కడా కనిపించకుండా పాలకులు జాగ్రత్తపడ్డారు, పోనీ మనం నేర్చుకుందాం అని అనుకున్నా, పిల్లలకు నేర్పుదామనుకున్నా., ఎవరైనా మృతి చెందారంటే ఘంటశాలగొంతుతో రికార్డు వినిపిస్తారాయే!! గీతా శ్లోకాలు వినపడ్డాయంటే.. శోకాలు విన్నంత భయంపట్టుకుంది. మైకుల్లో వింటే మైలపడినంతగా గుండెలోతుల్లో గుబులు. ఇది కూడా మన సంస్కృతి సంప్రదాయాలపై పరోక్షంగా దాడి, ఒక ఎత్తుగడలా అగుపిస్తుంది.

భగవత్గీత శ్లోకాలు వింటున్నంత సేపూ వాటి అర్థం పరమార్థం తెలిసినట్టే అగుపిస్తుంది. అవి సరళంగా ఉన్నట్లు అనిపించినా వాటిలో ఎంతో అర్థం జీవిత సత్యం పరమార్థం దాగి ఉంటుంది.

నాటి నుంచి నేటి వరకు ఆధ్యాత్మిక గురువులు భగవత్గీత ప్రాశస్త్యాన్ని చెబుతున్నా అది మన దేశంలో పాఠ్యాంశం కాలేదు. ఆశ్లోకాలలో ఏ ఒక్కటి కూడా చదువుతున్న చదువుల్లో కనిపించదు. అ..ఆ.,లు దిద్దుతున్నప్పుడే "ట్వింకిల్ ట్వింకిల్ లిటిలిస్టార్" అని, పాఠశాల విద్యలో "బొట్‌సెల్ ఆన్ ది రివర్" అని పిల్లలు చదువుతుంటే సంబరపడి పోవడం కాదు. మన పిల్లలకైనా భగవత్గీత నేర్పిద్దామన్న ఆలోచన చేసినవారిని అభినందిద్దాం. పిల్లల గొంతులో శ్రావ్యంగా గీత విని సంబరపడేలా ఆధ్యాత్మిక గురువులు ప్రోత్సహిస్తున్నారు.

అమెరికాలో భగవద్గీత సహస్ర గళార్చన దత్తపీఠం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గణపతి సచ్చిదానంద స్వామీజీ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంలో చిన్నారులు ఆలపిస్తున్న తీరు గమనిస్తుంటే ఆనందం కలిగింది. వీరంతా మనవారే సుమా అనిపించింది. ఇంగ్లీషు చదువులు చదువుతున్నా స్పష్టంగా వారు గీత ఆలపిస్తున్నది వింటుంటే మైమరచిన సందర్భం అది.

ఇక్కడ మరో విషయం ప్రస్తావించాలి. చాలా కాలం క్రితం మన ఇళ్లలో అంత్యాక్షరీ ఆడేవారు. అప్పుడు ఆడే అంత్యాక్షరీ సంస్కృత శ్లోకాల ద్వారా సాగేవి. అప్పుడు పోటీపడి పిన్నలు పెద్దలు శ్లోకాలు నేర్చుకునేవారు. సంస్కృతి, విజ్ఞానం, వికాసం అందరికీ అబ్బేవి. కానీ ఆ సంప్రదాయం అంతరించింది. అంత్యాక్షరీలో సినిమా ప్రభావం చేరింది. సినీ పాటలతో అంత్యాక్షరీ సాగుతోంది. ఈ విషయం పెద్దలు చెప్పినా నమ్మేస్థితిలో మనం లేము. ఇలా సంస్కృతిపై ముప్పేట దాడి జరిగిందన్నది వాస్తవం! వాస్తవం గ్రహించాల్సిన తరుణం వచ్చింది.

నేతలు, నాయకులు మనసిక ప్రశాంతతకోసం భగవద్గీత చదవేవారమని ప్రస్తావించిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల బ్రిటన్ ఎన్నికలలో ప్రధాని పదవి రేసులో ఉన్న వ్యక్తి ఒక సందర్భంలో భగవద్గీత మీద ప్రమాణం చేసినప్పుడు మన పత్రికలు, మీడియా గొప్పగా చెప్పుకొచ్చింది. కానీ దేశ సంస్కృతీ సంప్రదాయాలపై పాలకులు అంతగా దృష్టిపెట్టలేదన్నది జగమెరిగిన సత్యం. ఇప్పటికైనా మేల్కొని సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణకు నడుం బిగించండి. మన ప్రయత్నం మనం చేయడంలో తప్పులేదు.

– చీఫ్ ఎడిటర్

# విజయ సూచిక ఆశ్వయుజం

అశ్విని నక్షత్ర యుక్త పూర్ణిమ కలిగిన మాసం ఆశ్వయుజం. ఆసేతు హిమాచలం అన్ని రాష్ట్రాల్లోనూ ఈ మాసం ఉత్సవాలతో కన్నుల పండుగగా ఉంటుంది. తెలంగాణ ప్రాంతంలో భూదేవి పుష్ప భూషిత అయి వెలిగే పూల పండుగ "బతుకమ్మ"తో ఈమాసం ప్రారంభం అవుతుంది. శరన్నవ రాత్రులు దుర్గా నవరాత్రులు దసరా నవరాత్రులు అని ఏ పేరుతో పిలిచినా ఈ మాస ప్రారంభం నుండి 9 రోజులు అమ్మవారి ఆరాధనలు, అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వచ్ఛమైన వెన్నెల నిండిన ఆకాశం, పూలతో వికసించే పచ్చని భూమాత, పర్వదినాల హర్షాతిరేకంతో మురిసే జనావళితో ఆనందాలు వెల్లివిరుస్తాయి. భారత రామాయణ విజయ సూచిత కథలు మహిషాసుర మర్దనం, నరకాసురవధ, దుష్టశిక్షణ గాథలు ప్రతి ఒక్కరు తెలుసుకునేలా పండుగలు జరుపుకుంటారు. నవరాత్రుల్లో దుర్గాదేవి లక్ష్మీదేవి సరస్వతి దేవి ఆరాధనలు చేస్తారు. ఒక్కోరోజు ఒక్కోస్వరూపంతో నైవేద్యాలతో శైలపుత్రి, బ్రహ్మచారిణి, కాత్యాయని, కాళికాదేవి, మహా గౌరీ, చంద్రఘంటాదేవి, కుష్మాండ దేవి, స్కంధ మాత, సిద్ధిధాత్రి అని 9 పేర్లతో పూజిస్తారు. తిరుమల శ్రీనివాస పెరుమాళ్‌లకు శరన్నవరాత్రుల్లో ప్రత్యేక బ్రహ్మోత్సవాలు జరుపుతారు. సంపన్నులు నిరుపేదలు కూడా యథాశక్తి వైభవంగా ఈమాసంలో వచ్చే దసరా దీపావళి పండుగలు జరుపుకుంటారు. ఈ మాసంలోని శరత్ పూర్ణిమ ఎంతో విశేషమైనది. దేవతాశక్తులు చంద్రబలంతో ఉత్తేజితమై ఉంటాయి. కనుక సకల కళలతో చంద్రుడు పరిపూర్ణుడై ఉంటాడు కనుక లక్ష్మీదేవి కటాక్షించే రోజుగా మహాలక్ష్మి ఆరాధనలు చేస్తారు. పూల పండుగ బతుకమ్మ తో ప్రారంభమై ప్రత్యేక పూజలతో దీపావళి దీపారాధనతో ఆశ్వయుజ మాసం కొనసాగుతుంది. ఆ ప్రత్యేక పర్వదినాల గురించి పెద్దల మాటగా తెలుసుకుందాము.


పాడ్యమిన దేవీ నవరాత్రులు ప్రారంభం. అన్ని దేవాలయాల్లో శరన్నవరాత్రి పూజలు ప్రారంభిస్తారు. తిరుమలలో మరియు మహాలక్ష్మీదేవి క్షేత్రమైన మహారాష్ట్రలోని కొల్హాపురిలో వైభవంగా ఉత్సవాలు జరుపుతారు సప్తమిన గోపూజలు ఆచరిస్తారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి అని మూడు రోజులు దసరా పండుగ జరుపుకుంటారు. విజయ దశమి గురించి అనేక వృత్తాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా ఈ రోజు నూతన వస్తువులు వాహనాలు గృహాదులకు శుభారంభం



చేస్తారు. శమీవృక్ష పూజ సంప్రదాయంలో ఉంది. చారిత్రికంగా కూడా విజయదశమిన రాజులు ఆయుధపూజ, శమీవృక్ష పూజలు నిర్వహించేవారు. నేటికీ అదే ఆచారంగా అన్ని వృత్తుల వారు వృత్తి పనిముట్లను పూజిస్తారు. భారత యుద్ధ విజయానికి మూలపురుషుడైన అర్జునుడు దుష్టసంహర్త అయి విజయాన్ని చేకూర్చిన శ్రీరాముణ్ణి ఈ పండుగ రోజు తలుచుకుంటారు.

"శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనం అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శనం" అని ప్రార్థిస్తారు. దశమిరోజు త్రిమతాచార్యులలో ఒకరయిన మధ్వాచార్య జయంతిని జరుపుకుంటారు. ఏకాదశి పాశాంకుశ ఏకాదశి అని పుణ్యప్రదమైనది. ద్వాదశిని విశోక ద్వాదశి అని పిలుస్తారు. ఆశ్వయుజ పూర్ణిమ ఎంతో విశేషమైనది. అశ్వినీ దేవతలు అనుగ్రహించే రోజుగా, లక్ష్మీదేవికి ప్రియమైన పూర్ణిమగా వ్యవహరిస్తారు. స్త్రీలు అర్ధరాత్రి వరకు మేలుకొని ఉండి ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపి చంద్రుని ప్రతిబింబాన్ని సుగంధద్రవ్యాలు కలిపిన పాలలో చూస్తారు. ఆపాలను పాయసంగా వండి సేవిస్తారు. కొన్ని ప్రాంతాల్లో సుహాసినిలు ఉపవాసం ఉండి కర్వాచౌత్ అని ఈ పండుగ జరుపుకుంటారు. లక్ష్మీదేవి అర్ధరాత్రి అందరి గుమ్మాలలో నిలిచి కోజాగర? అని ఎవరు మెలకువగా ఉన్నారు అని ప్రశ్నిస్తుందిఅట అందుకే ఈ పూర్ణిమను కోజాగర్ పూర్ణిమ అని పిలుస్తారు. బహుళ తదియ నాడు కొన్ని ప్రాంతాల్లో అట్లతద్ది జరుపుకుంటారు. తెలంగాణ ప్రాంతంలో తొమ్మిది రోజులుగా నిర్వహించుకునే బతుకమ్మ ముగింపును సద్దుల బతుకమ్మ పెద్దబతుకమ్మ అను పేర్లతో వైభవంగా నిర్వహించి ముగిస్తారు. **మిగతా 7లో**

# సుప్రసిద్ధ వరాల వరాహ స్వామి క్షేత్రం




సర్వ రక్షకుడైన ఆదిదేవుడు ఆది వరాహ మూర్తి యై తన కోరలపై ఎత్తి జలప్రళయం నుంచి భూమండలాన్ని రక్షించాడు. మహాసురుడు అయిన హిరణ్యాక్షుడు భూదేవిని చాపలా చుట్టి పాతాళంలో దాచినప్పుడు శ్రీ మహావిష్ణువు అవతరించి అసుర సంహారం చేసి వరాహమూర్తి యై ఉద్ధరించాడు. దశావతారాల్లో ప్రసిద్ధమైన ఆది వరాహ మూర్తి దేవాలయాలు చాలా అరుదుగా ఉంటాయి. మన తెలుగు రాష్ట్రాల్లో తిరుమలలోని శ్రీ వరాహ స్వామి దేవాలయం పెద్దపెల్లి జిల్లా మంథెన మండలం కమాన్పూర్ లో గల ఆది వరాహ స్వామి దేవాలయం రెండే ప్రసిద్ధమైనవి. ఇక్కడ వెలసిన వరాల వరాహమూర్తి స్వరూపంలో మరో విశేషం ఉంది. త్రిదశాబ్దాల క్రింద ఒక బండరాయిపై చిన్ని స్వరూపం లో ఉన్న ఆది వరాహ స్వామి నేటికీ పెరుగుతూ కనిపిస్తున్నది.స్వామి శరీరం పై రోమాలు కూడా కనిపించడం ఆశ్చర్యం! ఇక్కడి శాసనాల ఆధారంగా స్థల చరిత్రను పరిశీలిస్తే 600 సంవత్సరాల క్రిందటి ప్రత్యేక పుణ్యక్షేత్రం అని తెలుస్తున్నది. ఒక మహర్షి తపస్సు ఫలితంగా ఆయన కోరికపై వరాల సిద్ధి వరాహస్వామి ఇక్కడ వెలిసాడు. ఒక భక్తుడు భక్తితో స్వామికి దేవాలయాన్ని కట్టించాలనుకుంటే ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆ భక్తుని స్వప్నంలో స్వామి కనిపించి తనకు మందిర నిర్మాణం ఇష్టం లేదని చెప్పాడట!



ఆవరణలో ఇతర కట్టడాలు ఉన్నప్పటికీ స్వామికి మందిరం ఉండకపోవడం విశేషం సింగరేణి వారి నిర్మాణపు పనుల్లో స్వామి పాదాల ఆనవాలు బయటపడ్డాయి.ప్రపంచంలోనే ప్రథమంగా మరియు స్వయం వ్యక్తంగా మన తెలంగాణలో నిజ వరాహ మూర్తి ఉండటం విశేషం చాలా మందికి వరాహస్వామి కులదైవంగా కూడా ఉంటు ప్రతినిత్యం ఈరూపంతో ఆరాధనలందుకుంటు ఉంటాడు. అలానే భక్తులకు స్వప్నంలో దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనంకలిగిస్తాడని భక్తుల మహావిశ్వాసం. గ్రహ దోషాలకు, గృహషాలకు వరాహస్వామికి ఇక్కడ అభిషేకం ప్రత్యేకం. అలానే ఇక్కడ అన్నిరంగాల్లో విజయం పొందటానికి స్వామికి విశేషపూజలు కూడా నిర్వహింపబడతాయి. అలానే సంతానానికి వివాహానికి స్వామికి కళ్యాణం పూజలు నిర్వహింపబడతాయి. ఢిల్లీలో ఉన్న భక్తుడికి స్వప్నంలో కనపడి. ఉత్సవవిగ్రహాలతో కళ్యాణాన్ని నిర్వహించమన్నాడట! అలా స్వామి వారు వరాలు ఇచ్చే స్వామి కనుక అందరు వరాల స్వామి అని పిలుస్తారు. ప్రతి నిత్యమ్ అన్న దానం. మంచి వసతులు కూడా భక్తుల కైంకర్యములతో ఏర్పాటు చేశారు. అనేక మంది భక్తుల కోరికలు నెరవేర్చే వరాల వరాహ స్వామి క్షేత్రంగా ప్రసిద్ధమైన ఈ పుణ్య క్షేత్రంలో 30 సంవత్సరముల నుండి నియమనిష్ఠలతో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేద పండితులు కరీంనగర్ వేద భవన ప్రధానాచార్యులు అయిన శ్రీ ఉ.వే. శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యుల సూచన, పర్యవేక్షణలో వరాహ జయంతి ప్రత్యేక ఉత్సవాలు, హెూమాలు అర్చకులచే నిర్వహించబడుతున్నాయి. నిత్యం అనేకమంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు కరీంనగర్‌కు 52 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రం అరుదైన ఆది వరాహ స్వామి పుణ్యక్షేత్రం.




# శ్రీరామానుజ సుధామాధురి

## సంబంధం బంధమోచనం



మానవ సంబంధాలు బాగుంటేనే సమాజం పురోగమిస్తుంది భగవత్ సంబంధాన్ని గుర్తించ గలిగినప్పుడే జీవన సత్యం గోచరిస్తుంది. అలాగే ఆచార్య సంబంధ ఆవశ్యకత తెలియనప్పుడు జీవితం అగమ్యగోచరం అవుతుంది.

"ఆచినోతి శాస్త్రార్థాన్" అని తాము ఆచరించి అనుభవించి, ఉపదేశించి, ఉద్ధరించిన వారే మన ఆచార్యులు. భగవత్ ప్రాప్తి మార్గాన్ని అనుసరణీయంగా మనకు అందించిన వారే మన ఆచార్యులు. జ్ఞానపరిపక్వతతో పాటు పరంపరాగత ఉపదేశ ప్రాప్తి విశేషము మన ఆచార్యుల ప్రధాన యోగ్యత!



అటువంటి వారిలో అవతార పురుషులు, పరమ కారుణికులు, లోకోద్ధరణకై భగవన్నియామకంగా అవతరించిన వారు శ్రీభగవద్ రామానుజాచార్యులు. లౌకిక సంబంధాలు అవసరానుగుణంగా తాత్కాలికంగా ఏర్పడినవి. అవి క్షణికానందానికి, కాంక్షలకు, ఆకాంక్షలకు, నిలయమైనవి. భగవత్ సంబంధం పూర్వాచార్యోక్తిగా నవవిధ సంబంధ రూపంగా (తొమ్మిది రకాలుగా) సమన్వయం చేయబడింది. ప్రధానంగా శరీర శరీరి సంబంధాన్ని మన పెద్దలు నిరూపించారు. ఆచార్య సంబంధం మనలో జ్ఞాన బీజాలు వేసి కర్తవ్య స్ఫూర్తిని కలిగించి ఆత్మోజ్జీవనానికి పురిగొల్పుతుంది. శ్రీ భగవద్రామానుజాచార్య సంబంధం పరమోత్కృష్టమైనది పరమార్థ సాధకము అయినది. "మణి మంటప మార్గ దాయి" అని వైకుంఠానికి చేర్చేవారు శ్రీరామానుజాచార్యులని కీర్తిస్తారు. రామానుజ సంబంధం ఈ లోకమందు, పరలోకమందు కూడా ప్రయోజనాన్ని కలిగిస్తుంది. ప్రత్యక్షంగా రామానుజాచార్యులతో సంబంధం కలిగి తరించిన పూర్వాచార్యులు ఎందరో వారి శ్రీసూక్తులతో శ్రీరామానుజ సంబంధ ప్రయోజనాలను మనకు తెలిపి తాము అనుభవించి తరించారు. వారు జగదాచార్యులకు శిష్యులై ఉండి శిష్య సంబంధమే కాదు ప్రత్యేక అనుబంధాన్ని కూడా పొందారు. అటువంటి వారిలో శ్రీ గోవింద భట్టర్లు సోదర సంబంధులు. వీరే జగదాచార్యుల తర్వాతి ఆచార్యులు. ఎంబార్లు అను నామ ప్రసిద్ధులు. శ్రీ రామానుజాచార్యులతో కలిసి విద్యాభ్యాసం చేశారు. శ్రీతిరుమలనంబి వారి వద్ద శిష్యులుగా ఉండి వారి ఆజ్ఞతో శ్రీరామానుజాచార్యులకు ప్రియ శిష్యులు అయినారు. వారు అత్యంత ఆచార్య నిష్ఠ గలవారు. శ్రీతిరుమల నంబి వారు జగదాచార్యులకు దేహ బంధువులుగా మేనమామగారు. విశేషించి వారు శ్రీరామాయణ ఉపదేశం గావించారు. జగదాచార్యుల పంచాచార్యులులో వీరు ఒకరు. జగదాచార్యులకు ఆచార్యులైన పంచనంబులు 1) పెరియనంబి 2) పెరియతిరుమల నంబి 3) తిరుక్కోష్టియూర్‌నంబి 4)తిరువరంగ పెరుమాళరయర్ 5) తిరుమాలై యాండాన్. ఈ పంచాచార్యుల వద్ద ప్రత్యేక విషయాలలో ఉపదేశాలు పొంది వారితో ఆచార్య, శిష్య సంబంధాన్ని కలిగి ఉన్నారు. యతిరాజుల చిన్నమ్మ కుమారులుగా బంధు సంబంధం కలిగిన మొదలియాండాన్ జగదాచార్యులకు ప్రియ శిష్యులు మీరు రామానుజన్ పొన్నుడిగా ( పాదుకలుగా ) త్రిదండంగా కీర్తించబడతారు. ఎక్కడికి వెళ్ళినా జగదాచార్యులతోనే ఉండేవారట! అనేకమంది శిష్యులను వాత్సల్యపూర్ణులై అనుగ్రహించు జగదాచార్యులతో ఆచార్య సంబంధము ఎంతో గొప్పది. వారు తమ శిష్యులకు వారివారి సామర్థ్యాలను బట్టి ఆయా కైంకర్యాలను అప్పగించే వారట! క్షీర కైంకర్యం చేసే వడుగనంబి గొప్ప ఆచార్య నిష్ఠ గలవారు. వారు ఆచార్యులను భగవంతుని కన్నా గొప్పవారిగా భావించారు. సిద్ధాంత చర్చలలో ఆచార్యుల హృదయాన్ని ఆవిష్కరించే జ్ఞానపూర్ణులు శ్రీకూరత్తాళ్వాన్లు. వీరి చరిత్ర,

# సంబంధం బంధమోచనం

ఆచార్యభక్తి ఎంతో విశేషమైనది. యతిరాజుల సంకల్ప అనుగ్రహంతో దిద్దుబాటు గావించబడి శ్రీరంగనాథ దేవాలయ పరిపాలన బాధ్యత వహించిన వారు తిరువరంగత్త అముదనార్లు. వీరు అత్యంత ఆచార్య నిష్టతో ప్రపన్న గాయత్రిగా కీర్తించబడు ఇరామానుజ నూత్తన్దాదిని రచించి గానంచేశారు. యతిరాజులకు నమ్మాళ్వారులంటే ప్రీతిమెండు. వారి పాదస్థానీయులుగా శ్రీ రామానుజాచార్యుల ను స్తుతిస్తారు. జగదా చార్యులు శ్రీ నమ్మాళ్వారుల పేరు గల కుమారులు తనకు కావాలని భావించారట! ఒక మహానుభావునికి ఆ దివ్యనామం తిరుక్కురుగూర్‌పిరాన్ పిళ్ళాన్ (ఆల్వార్ తిరునగరికి ఉపకారం చేసిన వారు అని అర్థం) అను నామకరణం చేసి తన పుత్ర సమానులుగా స్వీకరించారట! వారికి తిరువాయ్‌మొళిని ఉపదేశించి వారిచేత తిరువాయ్‌మొళికి వ్యాఖ్యానాన్ని రాయించారు. కాలక్షేప సమయంలో వారు ఎంతో పరవశించి వినే వారట!

వాదోపవాదాలతో సిద్ధాంత చర్చలతో ఎందరినో దిద్దుబాటు చేసి ప్రపన్నులుగా తీర్చిదిద్దారు శ్రీరామానుజాచార్యులు. అటువంటి వారే యజ్ఞ మూర్తులు వీరు మహాజ్ఞాని. 17 రోజులు యతిరాజులతో వాదోపవాదాలు గావించారు. చివరిరోజున రామానుజాచార్యులు తమ ఆరాధ్యదైవమైన వరదరాజపెరుమాళ్లను ప్రార్థించి వాదానికి ఉపక్రమించారు. కానీ వాదన ప్రారంభం కాకముందే ఆచార్యుల తేజస్సు చూచి చకితులై ఓటమిని ఒప్పుకున్నారట! ముందే చేసుకున్న ఒప్పందం ప్రకారం గెలిచిన వారి నామధేయం ఓడినవారు వహించాలి. వరదరాజ పెరుమాళ్ళను అరుళాళపెరుమాన్ అని పిలుస్తారు. కనుక వారికి అరుళాళప్పెరుమాన్‌ఎమ్బెరుమానార్ అను నామాన్ని అనుగ్రహించారు. ఒకసారి వీరి వద్దకు కొందరు శిష్యులను శ్రీసూక్తి ఉపదేశం కోసం జగదాచార్యులు పంపించారు. వారికి భగవద్ రామానుజాచార్య పాదములే అందరికీ రక్షకం అని ఉపదేశించారు. ఈ విధంగా వేల మందిని తమ సహేతుక వాదనలతో పరివర్తింప చేశారు యతి రాజులు.

శ్రీరామానుజ సంబంధంతో ఎందరో ప్రపన్నులై తరించారు. వారికి ముందు కాలమందలి ఆచార్యులతో కూడా ప్రత్యేక సంబంధం ఉంది. వారు అవతరించక ముందే వారి పూర్వాచార్యులు భవిష్యత్ ఆచార్యులుగా శ్రీరామానుజాచార్యుల అర్చామూర్తిని ఆరాధించి పరంపరగా ఆమూర్తిని కాపాడారు. దివ్యదేశ పెరుమాళ్ళతో యతి రాజులకు గల సంబంధము విశేషమైనది. శ్రీరంగనాథ పెరుమాళ్లతో శిష్య సంబంధాన్ని, శ్రీకంచి వరదరాజ పెరుమాళ్ లతో పుత్ర సంబంధాన్ని, తిరునారాయణ పురం శెల్వపిళ్ళై (సంపత్కుమార) పెరుమాళ్ళతో పితృసంబంధాన్ని తిరుమల శ్రీనివాస పెరుమాళ్ళతో ఆచార్య సంబంధాన్ని కలిగిఉన్న విశేషాలను మన పెద్దలు అద్భుతంగా సమన్వయం చేస్తారు. గోదాదేవి మొక్కును తీర్చి ఆండాళ్ తల్లితో సోదరులుగా గోదాగ్రజాయ నమః అనే నామాన్ని పొందారు. ప్రపన్న లోకానికి జ్ఞానాన్ని ప్రబోధించిన ఉపకార ఆచార్యులు ఎందరు ఉన్నప్పటికీ ఉత్తరకాచార్యులు శ్రీభగవద్రామానుజాచార్యులు మాత్రమే! అని పూర్వాచార్యులు నిర్ధారించారు. అందుకే శ్రీరామానుజ సంబంధము పరమోత్కృష్టమైనది. అందుకే ఆచార్య సమాశ్రయణం ఉపదేశములు పొందే ప్రపన్నులకు శ్రీభగవద్ రామానుజాచార్య శరణాగతినే ఉద్బోధిస్తారు. ఆక్రమంలోనే శ్రీరామానుజాచార్యుల తిరువడి తిరుముడి ఆచార్యులను గురుపరంపరగా స్తుతించడం సంప్రదాయం! సంసారబంధ దుఃఖ నివృత్తికి, భగవదనుగ్రహ ప్రాప్తికి శ్రీరామానుజాచార్యుల సంబంధమే ప్రధానము. అందుకే శ్రీరామానుజ సంబంధాన్ని తెలియజెప్పే శ్రీరామానుజ దాసన్ అనే నామ సంబంధంతో సంప్రదాయ పరులు తరిస్తారు.

## విజయ సూచిక ఆశ్వయుజం

➡ 4వ పేజీతరువాయి స్త్రీలంతా ఆడిన బతుకమ్మను నీటిలో అంపి ముగిస్తారు. అద్భుత సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక దీపావళి పండుగ. బలిని పాతాళానికి తొక్కి దేవతలను ఉద్ధరించిన రోజుగా ,శ్రీరాముడు రాజ్యాన్ని స్థాపించిన రోజుగా, నరక సంహారం తర్వాత శుభాలు నెలకొన్న రోజుగా అనేక పురాణకథల ప్రాధాన్యంతో దీపావళి పండుగ జరుపుకుంటారు. లక్ష్మీదేవికి లోకరక్షణ ప్రీతికరం కనుక ఆశ్వయుజ మాసం కూడా మహాలక్ష్మికి ప్రీతికరం కనుక విజయానికి సూచికగా, సిరులకు నెలవుగా ఆశ్వయుజ మాసాన్ని భావిస్తారు. విజయాన్ని ప్రసాదించే దసరా నవరాత్రులతో మొదలై సిరులు పెంచే దీపావళితో ముగిసే ఆశ్వయుజం అందరికీ శుభాలను కలిగిస్తుంది.




# మనసులోని మాట...

## మాకూ చేరింది

పత్రిక చాలా బాగుంది, మాకు చేరినందులకు ఎంతో ఆనందంగా వుంది

**చెలమసెట్టి శ్రీనివాస్, టీచర్, ముసలయ్యపేట,**
**ఈస్ట్ గోదావరి జిల్లా**

## వాస్తవానికి దర్పణం

జరుగుతున్న విషయాలకు  అద్దం పట్టే లా ఉన్న శ్రీసన్నిధానం పత్రిక సంపాదకీయం ఎంతో బాగుంది

**రామోహనరావు, పూనె, మహారాష్ట్ర**

## పోస్ట్ రావడం లేదు

పత్రిక ఎంతో బాగుంది, కాని మాకు పోస్ట్ రావడం లేదు. మేము చందా కట్టడానికి సిద్ధం. మీరు పంపిన రెండు పత్రికలు మాకు అంద  లేదు. పోస్ట్ ప్రాబ్లమ్  వుంది.

**టి.యస్.రావు, పూనే**



## సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బ్రహ్మాండ నాయకుడు తిరుమల వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ చివరి వారం సోమవారం అంకురార్పణ కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామి సర్వసేనాధిపతైన విష్వక్సేనుడు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడాన్ని అంకురార్పణం అంటారు. విష్వక్సేనుడు ఛత్రచామర, మేళతాళాల మధ్య ఊరేగింపుగా మాడవీధిలో ఉత్సవ ఏర్పాట్లను చూస్తూ తిరిగి ఆలయానికి చేరుకున్న తర్వాత యాగశాలలో శాస్త్రోక్త కార్యక్రమాలను నిర్వహించారు. లలాట, బాహు, సప్త పునీత ప్రదేశంలో భూమిపూజ జరిపారు. తొమ్మిది కుండల్లో శాలి, వ్రిహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను ఆ మట్టిలో కలిపి మొలకెత్తించే పనికి శ్రీకారం చుట్టారు. వేద మంత్రోచ్చారణల నడుమ బీజావాపం కార్యక్రమంతో అంకురార్పణ కార్యక్రమం సమాప్తమైంది.

ఆలోచన

చిన్నదే కానీ ఆశయం గొప్పది.

జాతి సమైక్యతకు, చైతన్యానికి విజ్ఞానపు వెలుగులు అందించాలన్న ప్రయత్నం గొప్పదని పాఠకులు శ్లాఘిస్తుంటే శ్రీసన్నిధానం ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ వెళుతోంది. పాఠకుల మనసులోని మాట, వారి ఇచ్చే సలహాలు శిరోధార్యం. వ్యయ ప్రయాసలతో భారం ఎక్కువైనా ఆశయ సాధనకోసం మావద్ద చిరునామాలను నమోదు చేసుకున్న వారందరికీ పత్రికా ప్రతులను అందించే ప్రయత్నం చేస్తున్నాం. మీ వేంట మేమూ ఉన్నాం అంటూ పాఠకులు శ్రీసన్నిధానం ట్రస్ట్ తలుపులు తడుతున్నారు. చాలా మందికి పత్రిక చేరుతోంది. దూర ప్రాంతాలవారికి పోస్ట్ ద్వారా పంపుతున్నా వారికి చేరడంలేదని తెలిసి కలతపడుతున్నాం. అయినా మా ప్రయత్నం కొనసాగుతోంది. ఆన్‌లైన్ ద్వారా ఉచిత ప్రతిని అందుకుంటున్న పాఠకుల సంఖ్య దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతోంది.

# మీకోసమే ఒక్క క్షణం...

## ఆవలోకించండి!! ఆలోచించండి!!

బాగుంది, భేష్, అద్భుతం, ఆధ్యాత్మిక సమాచార వేదిక. కావాల్సిన విషయాలు అన్నీ ఉన్నాయి. ఇలాంటి ఒకటి రెండు పదాలతో వచ్చిన లేఖలను ప్రచురించలేకున్నందుకు మన్నించండి. సద్విమర్శ, చక్కని సూచనలు చేసే వాటిని మనసులోని మాట వేదికలో పాఠకదేవుళ్ళ ముందు ఉంచుతున్నాము. మేం చేస్తున్న ఈ ప్రయత్నం మీరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తున్నాం. ఇప్పటికే చాలా మంది ఫోన్ ద్వారా సంప్రదించినవారు మేము అండగా నిలబడుతాం ట్రస్ట్‌కు సహకరిస్తాం అంటున్న వారి మాట సహాయం మాత్రేమే మాకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. లాభాపేక్షలేకుండా ప్రతీనెలా చేతినుంచి ముద్రణ వ్యయం కష్టమే! కానీ ఆశయం ముందు అది మాకు చిన్నదిగానే కనిపిస్తుంది.

మా మనసులోని మాటల్లో నిజం మీకు కనిపిస్తే... మాగుండెచప్పుడు మీకు వినిపిస్తే స్పందించండి!! అదేమాకు బలం ఇస్తుంది సుమా!!

-మేనేజింగ్ ఎడిటర్

0878 2933323; 9502583323;

# ఆధ్యాత్మిక వార్తలు



కరీంనగర్ జెట్ వికాసతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహింపబడిన "శ్రీమద్భగవద్గీత ఉచిత శిక్షణా శిబిరం ముగింపు ఉత్సవం ముచ్చింతల్ శ్రీరాంనగర్ దివ్య సాకేతంలో సెప్టెంబర్ 1న జరిగింది. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి శ్రీ అహోబిల జియ్యర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో దాదాపు '60' మంది చిన్నారులు భగవద్గీత పఠనం గావించి స్వామి వారి మంగళాశాసనాలు పొందారు. ఈ సందర్భంగా జీయర్ స్వాముల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.







## అమెరికాలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభం

భగవత్‌గీత సహస్ర గళార్చనతో అమెరికా డల్లాస్‌లో ఆధ్యాత్మిక సౌరభం ఇటీవల వెల్లివిరిసింది. ఎల్లవేళలా గీతా పారాయణం వల్ల విజ్ఞానవికాసం కలుగుతుందని అవధూత దత్తపీఠం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గణపతి సచ్చిదానంద స్వామీజీ ఉద్బోధించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ 80 జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డల్లాస్‌లోని దత్తపీఠం భగవత్‌గీత సహస్ర గళార్చన కార్యక్రమాన్ని నిర్వహించింది. అమెరికాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులు భగవత్‌గీత కంఠతా ఆలపిస్తున్న తీరు సందర్శకులను ఆశ్చర్య పరిచింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వారు ఈ కార్యక్రమం నమోదు చేసుకోవడం ప్రత్యేక ఆకర్షణ.



# 'ఆది శంకర జన్మభూమి క్షేత్రం'లో నరేంద్ర మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఆది శంకరాచార్య జన్మభూమి క్షేత్రంలో అడుగిడి పులకించారు. ఈ విషయాన్ని తాను పొందిన అనుభూతిని ట్వీటర్‌లో ప్రస్తావించారు కూడా. ఇది నిజంగా చక్కనైన ఆధ్యాత్మిక ప్రదేశం. సంస్కృతిని పరిరక్షించిన ఆది శంకరాచార్యకు మనం రుణపడి ఉన్నాము. భావితరాల వారు సైతం అదేభావనతో ఉంటారు అని భావం వచ్చేలా కేరళ పర్యటన తరువాత ప్రధాని మోదీ తన ట్వీటర్‌లో ట్వీట్ చేశారు.


Narendra Modi
@narendramodi

I feel very blessed to be at the Sri Adishankara Janmabhumi Kshetram. It is indeed a special place. Generations to come will remain indebted to the great Adi Shankaracharya for his rich contribution towards protecting our culture.

సెప్టెంబర్ మొదటి వారంలో వివిధ అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి కేరళకు ప్రధాని మోదీ వెళ్లారు. కేరళ కొచ్చిన్‌కి వచ్చిన వెంటనే ఆది శంకర జన్మభూమి క్షేత్రానికి వెళ్లడానికి ఉత్సాహం చూపారు. అంతకు ముందు కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, భారతదేశంలోని ఈ దార్శనిక సాధువుల సహకారాన్ని గుర్తుచేసుకున్నారు.

కేరళలోని శ్రీనారాయణ గురు, చట్టంపి స్వామికల్,



అయ్యంకాళి వంటి అనేక మంది సాధువులు, సంఘ సంస్కర్తలు ఆదిశంకరుల వారసత్వాన్ని పొందారని అన్నారు. ఆదిశంకరులు తన 'అద్వైత' తత్వానికి ప్రసిద్ధి చెందారని వారు గుర్తు చేసారు. అనంతరం కేరళలోని ఎర్నాకులం జిల్లాలోని కాలడి గ్రామానికి వెళ్లారు. అక్కడ పెరియార్ నది ఒడ్డున ఉన్న ఆదిశంకరాచార్యుల జన్మస్థల ప్రాంతాన్ని ప్రధాని సందర్శించారు, ఆదిశంకరాచార్యుల జన్మస్థలమైన 'ఆది శంకర జన్మభూమి క్షేత్రం'లో ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. మెడలో రుద్రాక్ష, సంప్రదాయ లుంగీ, అంగవస్త్రం, నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నారు,

కేరళ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా కనిపించారు. కేరళలో ప్రధాని మోదీ ఈ తరహాలో కనిపించడం ఇదే తొలిసారి. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయంలో 12 అడుగుల ఎత్తైన ఆదిశంకరాచార్య విగ్రహాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించిన సమయంలో కూడా రుద్రాక్ష ధరించి కనిపించారు.




# చెండీ ఉద్దాలకుల కథ

ప్రాచీన కాలం నుంచి ఎన్నో ఆసక్తి కలిగిన ఆచరణలు పద్ధతులు మన సంస్కృతిలో ఉన్నాయి. వాటిలో వ్రతాలు చేసుకోవడం ఒకటి. వ్రతం అంటే ఏదైనా కోరుకుని చేసే పూజా విధానం. ఇందులో విశేషం ఏమంటే ప్రతి వ్రతానికి కొన్ని కథలు ఉంటాయి. ఆ కథలు ఎంతో ఆసక్తికరంగా జీవిత సత్యాలు తెలిపేవిగా ఉంటాయి. అటువంటిదే చెండీ ఉద్దాలకుల కథ!

మగధ దేశంలో ఉండే చండినీ ఉద్దాలకులు బ్రాహ్మణ దంపతులు నిత్యం బద్ధ శత్రువులలాగా పోట్లాడుకునే వీరు కలిసి జీవించేవారు. ఉద్దాలకుణ్ణి వలితుడు అను పేరుతో కూడా పిలుస్తారు. వీరు చాలా పేదవారు. అయితే సంపాదించడం భర్త బాధ్యత కనుక చండిని ప్రతిరోజు భర్తను తమకు గల పేదరికానికి నిందించేది. భర్త ఏదిచెప్పినా దానికి వ్యతిరేకంగా ఆచరించేది. ఎక్కడ ఎవరు భార్యాభర్తలు పోట్లాడినా అందరూ "చెండీ ఉద్దాలకుల్లాగా" అని పోలిక చెప్పేవారు. ఆ అవమానాన్ని భరించలేక ఉద్దాలకుడు ఎంతో కలత చెందేవాడు. దుఃఖించే వాడు ఒకసారి తండ్రిగారి తిరువధ్యయనం చేయవలసి వచ్చింది. ఆ విషయం భార్యకు ఎలా చెప్పాలో తోచలేదు. అప్పుడు అతని స్నేహితుడైన గణేష్ శర్మ ఒక సలహా ఇచ్చాడు. ఏది చేయదలచుకున్నావో దానికి వ్యతిరేకంగా నీ భార్యను ఆజ్ఞాపించు అని చెప్పాడు. వలితుడు అలాగే చేసాడు. తన తండ్రి ఏమి ఆస్తి ఇయ్యలేదు కనుక తిథి ఆచరించను. ఒకవేళ ఆచరించినా మంచి భోక్తలను పిలువను. అని చెప్పడం ప్రారంభించాడు. మండిపడిన భార్య అలాగే అని చెప్పి, కార్యక్రమాన్ని శ్రోత్రియులైన భోక్తలను పిలిచి, శాస్త్రోక్తంగా ఆచరించింది. అది చూసి లోలోపల ఉద్దాలకుడు సంతోషించాడు. చివరికి ఆనందంతో కార్యక్రమం బాగా జరిగింది. పూజించిన పదార్థాలను నదిలో కలుపమని అన్నాడు. భర్త మాటకు వ్యతిరేకంగా చేసే చెండిని వాటిని మురుగు కాలువలో పడేసింది. ఆ విధంగా తిథి ఆచరణ నిష్ఫలమే అయింది. పాపం! విసిగిపోయిన వలితుడు లక్ష్మి కటాక్షం కలిగే వరకు అన్నం తినని ప్రతిజ్ఞ చేశాడు. ఇంట్లో నుంచి బయలుదేరి పండ్లు ఫలాలు భుజిస్తూ, అడవిలో తిరుగుతూ జీవనం సాగిస్తున్నాడు. అలా ఉండగా ఆశ్వయుజ పూర్ణిమ వచ్చింది. ఆ రోజు మహాలక్ష్మి వ్రతం అందరూ జాగారం చేసి అర్ధరాత్రి వరకు జూద క్రీడ ఆడాలని నియమం. అలా అడవిలో కొందరు యక్షకన్యలు ఆడుతున్నారు. వారు ముగ్గురే ఉండడం వలన మరొకరి కోసం వెతుకుతున్నారు. ఆ సమయంలో వలితుడు వారికి కనిపించగా వారు ఆడుటకు ఆహ్వానించారు. కానీ అలా రాత్రిపూట ఆడడం మహాపాపం అని వలితుడు వారికి చెప్పబోయాడు. కానీ ఆరోజు జూదక్రీడ వలన లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని యక్షకన్యలు చెప్పారు. బలవంతంగా వలితునితో జూద క్రీడ ఆడి అతన్ని ఓడించారు.

## బాలవిజ్ఞానం



అదేసమయంలో లక్ష్మీనారాయణులు భూలోక సంచారం చేస్తూ అతని దీనస్థితిని చూశారు. అర్ధరాత్రి వరకు జాగారం చేస్తూ ఉన్న వలితుని చూసి ఆనాటి వ్రత నియమం ప్రకారం జూదం ఆడిన ఆ పేద బ్రాహ్మణుణ్ణి కరుణించి కటాక్షించారు. లక్ష్మి కటాక్షంతో రూపము, యవ్వనము, ధనము పొందిన వలితుడు ఆశ్చర్యంతో సంతోషంతో ఇంటికి తిరిగి వచ్చాడు. తన కోరిక ప్రకారం ధనవంతుడై వచ్చిన భర్తను చూసి చెండిని ఆదరించింది. ఆనాటినుండి భర్త చెప్పిన మాట జవదాటకుండా కాపురం చేసింది. ఆ విధంగా వ్రతాచరణతో ఉద్దాలకుని కష్టాలు పోయాయి.



శ్రీ వైష్ణవ సేవా సంఘం. తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న కలకుంట్ల వర్షిణి, వైభవ్ కృష్ణ

# శ్రీ వైష్ణవ సేవా సంఘం ప్రతిభాపురస్కారాలు

శ్రీ వైష్ణవ సేవా సంఘం. తెలంగాణ (యన్.వి.యస్ ట్రస్ట్ హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలు ప్రోత్సాహకాలు ఇటీవల రవీంద్ర భారతి మెయిన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వైష్ణవ విశిష్ట వ్యక్తి పురస్కారాలు, దేశికోత్తమ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి చిన్న జీయర్ స్వామివారు ముఖ్య అతిథిగా విచ్చేసి మంగళా శాసనాలందించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్వామి వారి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.

శ్రీమాన్ గోవర్ధనం దేశికాచార్య స్మారక పురస్కారం హనుమకొండ శేషభట్టర్ వేంకటాచార్యులు, కరీంనగర్ శేషం శ్రీనివాసాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి, సముద్రాల వేణు గోపాలాచార్యులు, యస్ వి యస్ ట్రస్ట్ అధ్యక్షులు, చైర్మన్ కండ్లకుంట యాదిగిరా చార్యులు, కార్యదర్శి చిలుకమర్రి లక్ష్మీనాథా చార్యులు, సభ్యులు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.



వాడవాడలా వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. అంతకుముందు కోతి రాంపూర్ మరియు తిరుమల నగర్ రోడ్ నెంబర్ 3 లోని వినాయకుని వద్ద నిర్వహించిన వివిధ ఆటల పాటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను కూడా వారు ప్రదానం చేశారు.

